# పక్కింటి అబ్బాయి

రాత్రి ఒంటిగంట అయింది.

పక్కింటి పిల్లాడు ఏడుస్తున్నాడు.

బల్లమీద పుస్తకం పెట్టుకొని కుర్చీమీద కూర్చొని చదువుకొంటున్న "అవతల గది అబ్బాయి" - నిరంజనరావు (స్నేహితులకి "రంజన్") - కోపం పట్టలేక రెండు చేతులతోనూ జుట్టు పీక్కొని, పుస్తకంతో బల్లని దబ్బున కొట్టి, కుర్చీలోంచి చివాల్న లేచి, గదిలో అటూ ఇటూ పచారు చేయబోయాడు. ఆ గది పచారు చేయడానికి తగినంత విశాలంగా లేక పోవడంతో రంజన్‌కి కోపం ఇంకా చాలా ఎక్కువయింది. మేజా మీద వెలిగే టేబుల్ లైటు విరిచేసి, పుస్తకం చించిపారేసి, చదువుకి స్వస్తిచెప్పేసి ఎక్కడికైనా పారిపోదాం అనిపించిందతనికి. మరింక బతకడం దుర్భరం అనిపించింది.

రాత్రి ఒంటిగంట దాటింది. మరింక తెల్లవారదు. ఈ ఏడుపూ, ఈ రాత్రీ, ఈ చీకటీ - వీటికి వేటికీ అంతుండదు. ఈ నిరాశలోంచి పైకి పోవడానికి నిచ్చెన ఉండదు. హెల్ హెల్ హెల్! "ఈ రాత్రి ఎవర్నో ఒకర్ని చంపనైనా చంపేస్తాను. లేకపోతే నేను చస్తాను" అని పించేటంత కోపం వచ్చింది నిరంజనరావుకి. కోపంతో అతను ఉక్కిరిబిక్కిరయేడు, వంట్లో ఉన్న కోపం అంతా ముఖంలో ఎర్రగా కేంద్రీకృతం అవడంతో అతను కొలిమిలోంచి కాల్చి తీసిన గరిటెలా, కొంచెం భయంకరంగా, అకస్మాత్తుగా చూసినవారు జడుసుకొనేలా ఉన్నాడు; పిడికిళ్లు బిగించి నిస్సహాయంగా నిలబడ్డాడు. సహాయం కోసం అతనొక సిగరెట్ తీసి కాలుద్దాం అనుకున్నాడు. పాంటు జేబులో చెయ్యి పెట్టబోయేడు. కట్టుకున్నది లుంగీ కానీ, పాంటు కాదు. గోడకి పంట్లాం ఉంది కాని అందులో సిగరెట్లు లేవు. కొంచెం దూరంలో సినిమా హాల్ దగ్గర కిల్లీ కొట్టుంది. కాని అక్కడ నిరంజన్‌కి కాతా లేదు. భగవంతుణ్ణి "ఒరే దేవుడుగా!" అని పిల్చి అతణ్ణి తిట్టాలనిపించింది నిరంజనరావుకి. భయంకరమైనదీ, తీవ్రమైనదీ, అతి ప్రమాదకరమైనదీ, చలిగా చావుని తెచ్చేది, రాక్షసంగా రక్తం చిమ్మించేది ఏదైనా అటువంటి ఘోరమైన పని కనీసం ఒకటైనా చేయాలనిపించిందతనికి.

నిరంజనరావుకి తండ్రిలేడు. అంటే అతను తండ్రి లేకుండా పుట్టినవాడు కాడు, పుట్టగానే తండ్రి గండాన్న పుట్టినవాడు, తండ్రి పోయినా ఫరవాలేక పోనేమో; అతను కాస్త ఆస్తైనా విడిచిపెట్టిపోతే - కాని ఆ తండ్రి ఇంట్లో గిన్నెలూ, చెంబులూ కూడ వెతికి వెతికి పట్టుకు వెళ్లి ఖర్చుచేసి మరీ పోయేడు. అందుచేత నిరంజనుడు భూమ్మీద పడగానే అతనికి అమ్మా, ఆకలీ తప్ప మరేం దక్కలేదు. తన తండ్రి సర్వం నాశనం చేయకుండా ఉండినట్లయితే తన పరిస్థితి మరొకలా బాగా మెరుగ్గా ఉండేది కదా అనే జ్ఞానం నిరంజనరావుకి ఆరేళ్లనాడే

కలిగింది. ఆ జ్ఞానంతోపాటు అతనికి లోకంమీద కోపం కూడా అప్పుడే కలిగింది. పరిస్థితుల్ని జయించి, పై స్థాయికి వెళ్లాలనే పట్టుదల కూడా అతనికి అప్పట్లోనే కలిగింది. అతను ఎందుకంత కసిగా వుంటాడో చాలామందికి తెలియక ఒక్కొక్కప్పుడు అతడ్ని గాభరాపడి చూస్తూంటారు. "ఒకప్పుడు రాజులం" అనే తెలివి చాలా డేంజరస్ తెలివిగా పరిణమిస్తుందని వాళ్లకి తెలియదు. (నిరంజనరావు పూర్వులు ఒకప్పుడు రాజాగా, దర్జాగా బతికేరట). వెంకట్రావని ఓ కుర్రవాడు ఉండేవాడు. ఇప్పుడతను లేడు. అతను లేకపోవడం ఎలా జరిగిందంటే......

అయిదు ఫారంలో నిరంజనరావుకి అన్నింటిలోనూ పోటీగా ఉండేవాడు వెంకటరావు. అంతేకాదు, నిరంజనరావు యెడల ఎంతో స్నేహంగా ఉండేవాడు. అయినప్పటికి నిరంజనరావుని మించిపోయి అన్ని విషయాల్లోనూ అడ్డుగా వుండేవాడు. నిరంజనరావుకి బాగా వచ్చేవన్నీ కూడా అతనికి అంతకంటే బాగా వచ్చేవి. ఇంగ్లీషు వచ్చేది. లెఖ్ఖలు వచ్చేవి. వాలీబాల్, బాడ్మింటన్ ఆడ్డం వచ్చేవి. మాష్టర్ల మెప్పు సంపాదించడం వచ్చేది; అయితే, అతనికి ఈత వచ్చేది కాదు. అయితే, అతనికి ఈత వచ్చేదికాదు. నిరంజనరావుకి ఈత వచ్చును. "మరి నాకు నేర్పవురా!" అని ఎంతో సరదాగా అడిగాడు వెంకటరావు. కొన్నాళ్ళపాటు కొద్దిగా నేర్చుకున్నాక ఒకనాడు వెంకటరావు ఏటి నీటి సుడివైపు సరదాగానూ, తెలివితక్కువగానూ ఈదుకుపోతున్నప్పుడు, "అలా వెళ్లకురా, అక్కడ సుడుంది!" అని అతణ్ణి నిరంజనరావు హెచ్చరించేడే కాని నవ్వుతూ హెచ్చరించేడు. ఆ నవ్వు చూస్తే ఏటి నీటి సుడిలో ఏమాత్రం ప్రమాదం కూడా లేదనిపిస్తుంది తెలియనివారి కెవరికైనా సరే.

వెంకటరావు ఆవిధంగా జీవితంలో మరింక లేకుండా పోయేడు.

ఏటినీటి సుడిలోకి దిగిపోయి ఎక్కడికో కొట్టుకుపోయి వెంకటరావు చనిపోయినప్పుడు తనమీదికి ఎవరైనా తప్పు తోస్తారేమోనని నిరంజనరావు చాలా భయపడ్డాడు. కాని అదృష్టవశాత్తు అతణ్ణి ఎవరూ కూడా వెంకట్రావు గురించి ఆ రాత్రివరకూ అడగలేదు. ఆరాత్రి వాళ్ల నాన్న వచ్చి "మా వెంకట్రావు కాని నీకు కనిపించేడా నిరంజన్?" అని అడిగినప్పుడు నిరంజనరావుకి ఎంతో బెంగ తీరింది. అయితే, వెంకట్రావు తనతో ఈతకి రావడం "ఎవరూ చూడలేదన్నమాట! అమ్మ ! బతికేను! ఎందుచేత", "అబ్బే! నాకు కనిపించలేదండీ!" అని సులభంగా అనేయ గలిగేడు నిరంజనరావు. ఆ తరవాత అతణ్ని అప్పటికి చిన్నవాడవడంచేత కాబోలు, అంతరాత్మ అనేది ఏమాత్రం కూడా బాధించలేదు. పైపెచ్చు, వెంకట్రావు క్లాసులో లేకపోవడంతో నిరంజనరావుకి కాలిలో ముల్లు ఎవరో తీసేసినట్టు, చెవిలో జోరీగ పైకిపోయినట్లు ఎంతో హాయి కలిగింది. ఆ యేడు ఆటల పోటీల్లోనూ, క్లాసు పరీక్షల్లోనూ కూడా అతనే ఫస్టొచ్చాడు. "మన వెంకట్రావుంటే అన్ని ప్రైయిజులూ ఆడే ఎగరగొట్టుకుపోన్రా రంజనం" అని ఓ కుర్రవాడు నిరంజన్‌తో అన్నప్పుడు నిరంజన్‌కి ఆ కుర్రవాడిమీద చాలా కోపం వచ్చింది. "అయితే వెంకట్రావు లేకపోవడం నా తప్పా!" అని కొరకొరలాడుతూ అడిగేడు నిరంజనరావు.

నిరంజనరావు ఆవిధంగా కొరకొరలాడిన తరవాత పది సంవత్సరాలు జరిగిపోయేయి. పైని, ఒకటి రెండేళ్లు కూడా జరిగిపోయేయి. చిన్న వయసులోనే పెద్ద చదువులు చదివి నందువల్ల పరీక్షలు చాలా పాసయినప్పటికీ ఇంతవరకూ అతనికి పాతిక సంవత్సరాలు

దాటలేదు. ఈమధ్యకాలంలో అతను జీవితంలో లాభం పొందేడా, నష్టం పొందేడా అంటే రెండూ పొందేడని చెప్పవలసి ఉంటుంది. లాభం ఏమిటంటే - చదివిన చదువు బాగా రావడం, నష్టం ఏమిటంటే పగబట్టిన పరిస్థితుల్ని పూర్తిగా జయించలేకపోవడం. లాభం వల్ల అతనికి గర్వం బలిసింది. నష్టం వల్ల అతనికి దుఃఖం హెచ్చింది. ఇష్టంలేని పెళ్లికూతుళ్లు కాపరాలకి వెళ్లేక లోపల ఉన్న దుఃఖం వల్ల కొంతమంది దీనంగా కనిపిస్తారు. మరికొంతమంది కోపంగా, కసిగా కనిపిస్తారు. నిరంజనరావు లోలోపల దాగిన ఏదో ద్వేషంతో దహించుకు పోతున్నట్టుగా కనిపిస్తాడు. నలుగురుమధ్యా ఉన్నప్పుడు అతను ఛలోక్తులు విసురుతూ బాగానే ఉంటాడు. కాని అతని ఛలోక్తుల్లో సరదాకంటే వెటకారం ఎక్కువ వుంటుంది. అతని మాటలు వేసవి కాలంలో మల్లెపువ్వుల్లా మధురంగా ఉండవు. చలికాలంలో వానచినుకుల్లా చురుక్కు మంటాయి. తను మాట్లాడుతూన్నప్పుడు అతను ఎదటివార్ని పరీక్షగా చూస్తూంటాడు. రాజకీయ ఖైదీలకి సూదులు గుచ్చే పోలీసులు ఆపని ప్రభావం గురించి ఖైదీలని పరీక్షగా చూసినట్టుం టుంది అతని చూపు. మరింత ఒంటరిగా కూర్చున్నప్పుడు అతను ఏమి ఆలోచిస్తాడో చెప్పడం కష్టం కాని, అటువంటి సమయాల్లో అతను నిశ్చలంగా కనిపిస్తాడు. నిశ్చలంగా ఉన్నప్పటికి అతను ధ్యానంలో ఉన్న యోగిలా నిర్మలంగా కనిపించడు. సత్రంలో బైరాగిలా చవగ్గా కూడా కనిపించడు. పుట్టలో పాములా భయంకరంగా కనిపిస్తాడు.

పర్ణశాలల్లోనూ, బైరాగి సత్రవుల్లోనూ, ఇరుకు పుట్టల్లోనూ ఉండాలనే కోరిక ఎన్నడూ లేదు నిరంజనరావుకి. కాని, తను అటువంటి జాగాల్లోనే ఉండవలసిరాగా, తాహతు లేనివారికి మాత్రం స్వర్గలోకానికి నిచ్చెన్లు దొరకడం అతనికి పట్టరాని బాధగా ఉంది. లేమివల్ల బాధ కంటే, సంపద లేదే అనే బాధ అతనికి ఎక్కువగా ఉంది. రెక్కలకి ఆశగా ఎగరాలని ఉండగా, సంకెళ్లు బరువుగా దిగలాగడం వల్ల నిరంజనరావు తెగ బాధపడ్డాడు. అతను పరీక్షలు పాసయేడు. అతనికి చదువొచ్చింది. కాని, చదువు అనేది జీవితంలో మంచికి మార్గం అని అతను తెలుసుకున్నాడని చెప్పడం కష్టం. జీవితంలో అనేక అమర సౌఖ్యాలున్నాయని, వాటిని సంపాదించడానికి మార్గాలున్నాయనీ అతను "చదువు" ద్వారా తెలుసుకున్నాడు. "జ్ఞానం" అతన్లో కాంక్షల్ని రేకెత్తించింది, తహతహలు పుట్టించింది. అయితే, ఆశలెక్కువ, అవకాశాలు తక్కువ అవడంతో తలుపువార తోక చిక్కుకుపోయిన ఎలకలా అతను గిలగిలలాడేడు. అతనికి తనచుట్టూ ఉండే దారిద్ర్యపు వాతావరణం అన్నా, తనచుట్టూ ఉండే తనలాంటివారన్నా తెగ ద్వేషం ప్రబలింది. తన పరిస్థితికి వారంతా ఏదో రకంగా ఒక కారణం అయినట్టుగా వారిని అతను ద్వేషించ నారంభించేడు. అంతా ఒకే జెయిల్లో ఉన్నప్పటికి అమెరికాలో తెల్ల ఖైదీలు, నల్ల ఖైదీలను చూసినట్టు సాటివారిని చూసి అతను అసహ్యించుకో నారంభించాడు. దాదాపు రాచకుటుంబం లాంటి కుటుంబంలో ఆమె పుట్టి ఉండకపోయినట్లయితే అతిగా దారిద్ర్యంలో ఉన్నందున తన తల్లిని కూడా అతను ద్వేషించి ఉండునేమో! కాని ఆవిడది గొప్ప వంశం అని అతను ఎన్నడూ మర్చిపోలేదు. ఆవిణ్ణి తిరిగి గొప్పదాన్నిగా చేస్తానని అతను చిన్నప్పుడే రహస్యంగా శపథం చేసుకున్నాడు. అందుచేతనే బియ్యే పాసయేక "చిన్న నౌఖరీలో చిక్కుకు పోను" అని అతను భీష్మ ప్రతిజ్ఞ పట్టేడు. కాని అవసరం కొద్ది అతనికి చిన్న నౌఖరీ చెయ్యక తప్పింది కాదు. ఆ నౌఖరీ అతను చేసినప్పుడు అతని తోటి పనివార్లకి అతనంటే ఎందుచేతనో గాని చాలా అసూయగా, ఈర్ష్యగా ఉండేది. పై అధికార్లకు అతనంటే చాలా చిరాగ్గా ఉండేది.

వాళ్లనీ వీళ్లనీ ఎవర్ని చూసినప్పటికి అతనికి ఒళ్లు మంటగా ఉండేది.

పైకి వెళ్లడానికి ప్రప్రథమంగా ఏ ఒక్క ఛిన్నదారైనా దొరుకుతుందంటే నిరంజనరావు ఏ పాపం చెయ్యడానికైనా సిద్ధపడునేమో అంటే అందుగురించి ఎవరూ ఆశ్చర్యపడవలసిన అవసరం లేదేమో! అన్నగార్లయిన చక్రవర్తుల్ని (లేక చక్రవర్తులైన అన్నగార్లని) చంపి సింహాసనం అధిష్టించిన ఎంతమంది తమ్ముళ్లు ధర్మపరిపాలన చెయ్యలేదు. మొగుణ్ణి చంపించుకున్నాననే (కాబోలు) ముంతాజ్ బీగమ్ మొగల్ చక్రవర్తిని పెళ్లాడింది. కాని వారిప్రేమానురాగాలు పాలరాతిలో స్థిరపడిపోయి ప్రపంచం అంతటికి ఒరవడిగా ఉండిపోలేదా? అందుచేత జీవితంలో గప్పున, గభాల్న ఎగిరి పైకి వెళ్లడానికి ఒక్క చిన్న ఖూనీ, ఒక్క చిన్న పీక కోసే అబద్ధం, ఒక చిన్న అణా పరక అల్లరి, సంసారాన్ని చల్లార్చే పాపం - అటువంటిది ఏదైనా చేసి లాభం పొందే అవకాశం వస్తే అటువంటి అవకాశాన్ని నిరంజనరావు జారవిడుచుకోకుండా ఉండునేమో కాని, అటువంటి అవకాశం నిరంజనరావుకు దొరకలేదు. అందుచేతనే అతనికి మదిలో కోపం, హృదిలో మంటా ఎక్కువ.

పక్కింటి పిల్లడు ఏడుస్తున్నాడు. కోపం వల్ల నిరంజనరావు భగ్గున మండిపోలేదంటే ఆశ్చర్యం. కాని, కోపగించేడంటే ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు.

చెడుగుడు ఆడాలనుంటుంది. సుఖించాలని ఉంటుంది. కరకజం కొనుక్కు తినాల నుంటుంది. సుఖించాలనుంటుంది. పక్కింటి అమ్మాయిని ప్రేమించాలనుంటుంది. అహో! సుఖించాలనుంటుంది. అవును. కట్నం పుచ్చుకొని పెళ్లాడాలనే ఉంటుంది. పొరుగింటి జాంపండు తినాలనే ఉంటుంది. ఎప్పైస్‌గా సినిమా చూడాలనే ఉంటుంది. రహస్యంగా సెక్స్ కథలు చదవాలనే ఉంటుంది. పెరటిపక్క పేదవాడి జాగా కలిపేసుకోవాలనే ఉంటుంది. "తన్మయత్వం"తో తిరుపతి దేవుణ్ణి "అవున్నార్" చూడాలనే ఉంటుంది. కాని అకౌంట్స్ పరీక్షకి వెళ్లాలని మాత్రం ఎవరికో కాని ఉండదు.

నిరంజనరావుకి అకౌంట్సంటే ఇష్టం లేదు. కాని అతన్లో ఒక విశేషం ఉంది. తన స్థాయి పెరగడానికి ఏదైనా ఉపయోగిస్తుందంటే అది తనకు ఇష్టం లేకపోయినప్పటికీ అందు గురించి ఇష్టం కలిగించుకోగలడు. అతనికి సిల్లీ జోక్స్ అంటే ఇష్టం లేదు. కాని తనకి పనికొచ్చే కొందరికి అవి రుచిస్తాయనేసరికి పనికట్టుకొని ఎన్నో జోక్స్ సేకరించుకున్నాడతను. అలాగే అకౌంట్స్ పరీక్షకి కూర్చొని పాసయినట్లయితే ఈ బురదగుంటలోంచి బైటపడ్డానికి మార్గం ఉంటుందని తెలిసేసరికి అతను అకౌంట్స్ చిక్కులన్నీ తెలుసుకు తీరుతానని శపథం చేసు కున్నాడు. ఆ పరీక్ష పాసవడం అతనికి చాలా తేలిక అనిపించింది. దాన్తో అతనికి ఆశలు చిగురించనూ లేదు, మొగ్గ తొడగనూ లేదు. తారాజువ్వల్లా పైకిపోయి అక్కడి ముత్యాల్లా తేలియాడేయి. తన రంగురంగుల కలలన్నీ పక్కగదిలోనే ఉన్నాయనేసరికి తలుపు తెరుచుకొని అందులోకి వెళ్లడం "ఓస్, అదేపాటి పని" అనిపించిందతనికి.

అన్నపు గిన్నెకీ, అకలినోటికీ మధ్య అరవై లక్షల అవాంతరాలు ఉండవచ్చుననే (అర్థం ఇచ్చే ఇంగ్లీషు సామెత ఒకటుంది) సామెత ఒకటుందీ అంటే అది వట్టినే ఉండదు. ఆ సామెత చెప్పినట్టుగానే అయింది నిరంజనరావుకి అకౌంట్స్ పరీక్ష వ్యవహారం. మొదటిసారి వెళ్లినప్పుడు ఆశకీ, అకౌంట్స్ పరీక్షకీ మధ్య అమ్మ జబ్బు అడ్డొచ్చింది. పరీక్ష పదిహేను రోజులు

ఉన్నదనగా అతని తల్లి డబుల్ న్యూమోనియాతో చింకిచాపమీద పడుక్కొంది. ఇంట్లో చాప మీంచి ఆస్పత్రిలో మంచంమీదికి ఆవిణ్ని మార్చడానికి నిరంజనుడు నానా అవస్థలూ పడవలసి వచ్చింది. (ఆస్పత్రిలో చేర్చినా కూడా అక్కడ ఆవిణ్ణి వరండాలో నేలమీద పడుకోబెట్టేరు). ఈ అవస్థలు పద్ధంలో అకౌంట్స్ పరీక్షలో పాసు అతనికి దక్కకుండా పోయింది. అమ్మే తన భావికి అడ్డువచ్చినందుకు నిరంజనుడు భగవంతుణ్ణి బండబూతులు తిట్టుకొని కోపం తగ్గించుకున్నాడు. మరుసటిసారి పరీక్షకి మరింత పట్టుదలతో చదివేడు.

అతను మరుసటిసారి పరీక్షలో తప్పక పాసయే ఉండును పరీక్షకి వెళ్లినట్లయితే! కాని అతను పరీక్షకు వెళ్లలేదు. వెళ్లడానికి ఆరోగ్యం అడ్డురాలేదు. తన ఆరోగ్యమే అడ్డు వచ్చింది. అకౌంట్స్ పరీక్ష పాసవడం గురించి అతనికి ఎన్ని ఆశలున్నప్పటికీ ఆ ఆశలకి వేటికీ ఖాతర్ చెయ్యకుండా అతణ్ణి ఆటలమ్మ పట్టుకొంది. అతణ్ణి అంటురోగుల ఆస్పత్రిలో ఎకౌంట్స్ పరీక్షకి ఎంతో దూరంగా ఉంచవలసి వచ్చింది. ఆస్పత్రిలో ఉన్నప్పుడు అతనికి దేహబాధ కంటే మనోవేదన ఎక్కువయిపోయింది. పరిస్థితుల ప్రభావానికి తట్టుకోలేక అతని కొకనాటి రాత్రి గావుకేకలు వేయాలనిపించింది. ఆ సమయంలో అతనికి మరేం చెయ్యడానికి తోచక, "నర్స్! నర్స్! నా....ర్స్" అని అరవనారంభించాడు. సాయంకాలం కనిపించిన అందమైన అమ్మాయి నర్సుని పిల్చి, అర్ధరాత్రి వేళ ఆమెచేత అరవ చాకిరీ చేయించుకొని ఆమెని హింసించాలనే కోరిక అతనికెందుకో గాని కలిగి, అందుకే ఆమెని అతను అలా అరచి పిలిచేడు. అతడు అలా అరవగా అరవగా ఆ అమ్మాయి నర్సు రాకుండా ఓ అబ్బాయి నర్సు వచ్చేడు. రావడంలో కూడా ఆ అబ్బాయినర్సు అతి దుర్మార్గంగా వచ్చేడు. అతణ్ణి చూడగానే నిరంజనరావుకి పిచ్చికోపం వచ్చింది. "దైవం నన్ను దుర్మార్గంగా ఏడిపిస్తే నేనుకూడా కొందర్ని దుర్మార్గంగా ఏడ్పించగల్ను" అని మనసులో అనుకున్నాడతను. ఆ వచ్చిన నర్సు డాబుగా, కోపంగా, దుర్మార్గంగా కసురుకొంటూ రావడం వల్ల నిరంజనరావుకి కసితో కూడిన సంతోషం కలిగింది. కోపపు కప్పని పిచ్చిపాము అల్లరి పెట్టినట్లుగా ఆ అబ్బాయి నర్సుని అతను తెగ అల్లరి పెట్టి, అధికార్లు ఆ నర్సుకి ఛార్జిషీటు ఇచ్చేవరకూ అల్లరి తీసుకు వచ్చేడు. అబ్బాయి నర్సుని అల్లరి పెట్టినంత మాత్రంచేత అతను అకౌంట్స్ పరీక్ష పాసవలేదు. కాని, అతని కోపం కొంత తగ్గింది. కసి కొంత తీరింది.

ఇప్పుడు ఇది మూడోసారి, ఆఖరిసారి. పరీక్షకి కూర్చుంటే కూర్చోవడం, లేకపోతే పోవడం. అంటే, మరింక ఛాన్సు లేదు, ఇది ఈసారి పాస్ కాకపోతే తనకి మరింక ఈ బురదా, ఈ మురికీ తప్పవన్నమాట. అవి తప్పడానికి అవకాశం ఉన్నప్పటికీ, మళ్లీ అందు గురించి విశ్వప్రయత్నం చేయాలన్నమాట. అకౌంట్స్ మార్గం కాక, మరేదైనా మార్గం చూసుకోవా లన్నమాట. మార్గం వెతుక్కుందికే మహా ప్రయత్నం చేయాలంటే మరి ఆ దారంట వెళ్లడానికీ, వెళ్లి విజయం సాధించడానికీ "ఎంత ప్రయత్నం చెయ్యవలసి ఉంటుందో" అని ఆలోచించుకునేసరికి నిరంజనరావుకి గుండెలు చించుకున్నట్టు ఉంటూ ఉంటుంది.

అందుకే -

నిరంజనరావు అకౌంట్స్ పరీక్ష పాసవడం మీదే తన చావు బ్రతుకులన్నీ ఆధారపడి ఉన్నట్లు చదువుతున్నాడు. తనొక చీకటి కొట్లో చిక్కుకుపోయినట్టూ, ఆ కొట్లోకి వడివడిగా

ఏ మూలనుంచో నీరు చొచ్చుకు వస్తున్నట్టూ, తను గోడ తవ్వుకు బైటపడకపోతే మరింక కొద్ది నిమిషాలలో మరికొన్ని నిముషాల్లో గదంతా నీటితో నిండిపోయి తను ఉక్కిరిబిక్కిరయి తప్పక చనిపోయేట్టూ అతను భావించుకోసాగాడు. ఆ సమయంలో సెకెండు సేపు కూడ రెస్టు తీసుకోకుండా గోడని తవ్వేవాళ్లా అతను క్షణం సేపైనా విశ్రాంతి దీసుకోకుండా అకౌంట్స్ పరీక్షకి రాక్షసుల్లా చదవనారంభించేడు.

పక్కింటి పిల్లడు ఏడుపు ఆపకుండా ఉన్నాడు.

"పక్కింటి పిల్లడు" అంటే పక్కగదిలో ఉన్న పిల్లడన్న మాట.

ఆ యింటికి రెండే గదులున్నాయి. గదులకి ముందు వీధివైపు ఉన్నది ఆ ఇంటికి ఒకటే వరండా. గదికి రెండు గుమ్మాల చొప్పున నాలుగే గుమ్మాలు. గదికొక కిటికీ చొప్పున రెండేకిటికీలు, గధికి వెనక ఆ ఇంటికి దోసెడే పెరడు. ఆ పెరట్లో ఉన్న నూతిలోతు నాలుగే నిలువులు. ఆ దోసెడు పెరట్లో మూడే చెట్లు - రెండు కొబ్బరి, ఒకటి మామిడి, ఆ రెండు కొబ్బరిచెట్లకీ కలిపి మూడే కాయలు. ఆ మామిడి చెట్టుని ఎన్నడూ లేనివే కాయలు. ఎల్లప్పుడూ ఉండేవే దోమలు. వీధి వరండాలో ఎప్పుడూ ఉండేది వీధి ధూళి. గదుల్లోకి బాగా వీచినా రానిది గాలీ, వెలుతురూనూ, తలుపులు బిగించినా లోపలికి స్వేచ్ఛగా వచ్చేవి పెరటి దోమలూ, వీధి దుర్గంధాలూనూ. ఆ రెండు గదులూ కూడా బెత్తెడేసి గదులు, పైన పెంకులు, అందులో అక్కడక్కడ తేట్లు. చూరుకి చెదలు, తరచుగా నేలని చీమలు. ఈ సదుపాయాలన్నింటితోనూ గదికి అద్దె నెల నెలకీ అయితే నలభయ్యేసి రూపాయలు. ఆస్పత్రి రోగులైతే వారివ్వవలసిన అద్దె రోజుకి మూడు రూపాయలు. ఇంటివారు ఓ గది నెలవారీ చొప్పున అద్దెకిస్తారు. మరో గదిమీద రోజువారీ చొప్పున అద్దె లాగుతారు. రెండు గదులూ ఒకే పద్ధతి మీద ఎందుకివ్వరో ఇంటివారికే తెలియాలి. కాని, అందులో ఏదో లాజిక్కు ఉండే ఉంటుంది.

జిల్లా కేంద్రంలో ఉండి చదివేకంటే రాష్ట్ర కేంద్రం వచ్చి చదువుకోడం మంచిదని నిరంజనుడికి తోచి, తనుచేసే చిన్న నౌకిరీకి గుడ్‌బై కొట్టేసి, ఉన్నదంతా పెట్టి పేకాటకి దిగినట్టు చదువులోకి దిగేడు. చదువులోకి దిగేందుకే ఆ గదిలోకి దిగేడు. దిగి మూడు నెలలయింది. మరొక రెండు వారాలు కాదు పది రోజుల్లో అతను పరీక్షకి కూర్చోవలసి ఉంది. భావిభాగ్యం అనే కొండని తన అకౌంట్స్ పరీక్ష అనే దారంతో దగ్గరకి లాక్కోవచ్చుననే ఆశ అతనికి ఎక్కువయింది. ధైర్యం కూడా అతనికి ఎక్కువయింది. అతని అదృష్టవశాత్తూ పక్కని ఉన్న ఆస్పత్రి గదిలో మూణ్ణెల్లపాటు ఎవరో ఆస్పత్రి పేషెంటు, బంధువులిద్దరు పెద్ద మనుష్యులు ఏ అల్లరి చెయ్యకుండా ఉండి వెళ్లిపోయారు. తరువాత రెండు రోజులపాటు గది ఖాళీగా ఉంది.

వాళ్లు ఆ తరువాత దిగేరు.

ట్రంకుపెట్టె చూస్తే మనుష్యుల్ని వేరే చూడనక్కరలేదు, బాగా చిన్నది. బాగా తుప్పు పట్టింది. తాళంకప్ప లేనిది. మూతకి పుల్లలు అడ్డు పెట్టినది. తుప్పు పట్టిన బొడిపెలు కలది. అక్కడక్కడ లొత్తలు పోయినది ఆ ట్రంకుపెట్టె. అది చాలా దౌర్భాగ్యంగా ఉంది. మూత తెరిస్తే మీసాలు ఆడించుకుంటూ దాన్నిండా బొద్దింకలు ఉంటాయేమో అనిపిస్తుంది. "సంసారంతో పాటు అదిగూడా చల్లారిపోయిందనిపిస్తుంది". వికృతంగా పొంగిపోకుండా ఎడారి

పాడి వేడికి ఎండిపోయిన శవంలా ఉంది ఆ ట్రంకు పెట్టె.

ఆ ఆడమనిషి పుల్లలా వుంది. కట్టుకున్న చీరలోంచి ఆమె కాళ్లు అసహ్యంగా పుల్లల్లా కనిపిస్తున్నాయి. ఆమె గుండెలు అర్చుకుపోయాయి. ఆమె ముఖం పీక్కుపోయింది. అందుచేత మామూలుగా పొడవుగా ఉండే ఆమె ముక్కు అసహ్యంగా ఎంతో పొడవుగా కనిపిస్తోంది. ఆమె కళ్లు పిల్లిని చూసిన ఎలక కళ్లల్లా లేవు. పులిని చూసిన లేడి కళ్లల్లా వున్నాయి. ఆ లేడైనా ఆర్నెల్లనించీ ఏ ఆకూ అలమూ దొరక్క, ఉప్పనీళ్లు తాగి బతుకుతూన్న లేడన్నమాట. ఆమె ఎంతో బలహీనంగానే కాకుండా ఎంతో పొడవుగా కూడా ఉండడంచేత, సాగదీసిన పేదరికంలా ఉందావిడ. అంతేకాదు, ఊరుకాని ఊరు రావడం వల్ల కాబోలు ఆవిడ పెద్ద డాక్టర్ల ముందు నగ్నంగా నిల్చున్న జబ్బు మనిషిలా చాలా దీనంగా ఉంది. ఆమెలో సిగ్గుకంటే దైన్యం ఎక్కువ కనిపిస్తోంది.

ఆమె భర్త గురించి ఎంత తక్కువ చెప్తే అంత మంచిది. చర్మం, దంతం, ఎమిక, దగ్గు తప్ప అతన్లో ఇంకేమీ ఉన్నట్టు లేవు. అతను బాగున్నప్పుడు కుట్టించుకున్న చొక్కా కాబోలు, అది వదులుగా ఎవరో ధర్మం చేసిన చొక్కాలా ఉంది. అతను తొడుక్కున్నది పంట్లామా, పైజమానా? ఆ ప్రశ్నకీ దాన్ని కుట్టి పుట్టించినవాడు కూడా జవాబు చెప్పలేడు. అతనికీ అరిపాదాలే ఆకుచెప్పులవటంచేత చుట్టూరా అవి బీటలిచ్చేశాయి. ఆ బీటల్లో నల్లటి మురికి నిలవుంది. అతని గుండె సన్నంగా చిన్న ఫిడేల్ డొక్కులా ఉన్నప్పటికీ, దాన్నిండా కుండల కొద్దీ కఫం ఉన్నట్లుంది. అతను దగ్గి దగ్గి బాగా ఆయాసం తీర్చుకున్నప్పుడల్లా అతని నాలిక బైటకొస్తోంది. చింతనిప్పలాంటి అతని కళ్లు బుంగల్లా పెద్దవవుతున్నాయి. ఎవడో ఋషి ఎవడికో శాపం పెడితే అది పొరబాటున మరెవరికో తగిలినట్టు అతను అసహాయంగా బెంబేలు పడిపోతున్న ఆ మరెవరో లాగ కనిపిస్తున్నాడు. ఏం మాట్లాడాలన్న దగ్గు అడ్డు రావడం వల్ల అతను దగ్గుతూ దగ్గుతూ చేతుల్తో సంజ్ఞల మూలంగానే ఎక్కువ సంభాషిస్తూ కనిపిస్తాడు.

మరింక వాళ్ల పిల్లడు ఏడాదివాడు. తల్లి భుజంమీద పడుకొని ఉన్నాడు. ఆ పిల్లణ్ణి తొలి నాలుగైదు రోజులు కూడా నిరంజనరావు సరిగా చూడనేలేదు. వాళ్లందర్నీ చూడగానే మాత్రం అతను చాలా అసహ్యించుకున్నాడు. వాళ్లతో తనకి ఎటువంటి సంబంధమూ ఉండకూడదన్నట్టు వాళ్లని పలకరించనైనా పలకరించలేదతను. ఇంపోర్టెడ్ ఏర్ కండిషన్డు కార్లో వెళ్లవలసినవాడు, కర్మకాలి వద్దాదికి నాటురకపు రూట్ బస్‌లో వెళ్లవలసి వస్తే ఎదుట నుండే "చవక పాసింజర్లకీ", తనకీ మధ్య రీడర్స్ డైజెస్టు అడ్డు పెట్టుకున్నట్టు నిరంజనరావు ఆ జబ్బు సంసారానికీ, తనకీ మధ్య తన చదువుని అడ్డుపెట్టుకున్నాడు. తొలి రోజున దగ్గు మనిషి ఆస్పత్రికి వెళ్లివచ్చి, మధ్యాహ్నం రెండు గంటలకి నిరంజనరావుని "టైమెంత అయిందండీ బాబూ!" అని అడిగితే, నిరంజనరావు టైమెంతయిందో తనకి తెలియదని జవాబు చెప్పేడు. చదువులో నిమగ్నుడయేడు. ఆ చిన్న ప్రశ్నకి తను అలా మొరటుగా జవాబు చెప్పగలిగినందుకు అతను చాలా తృప్తికూడా పొందేడు - ఆ రోజుకి కనీసం ఒక చిన్న మంచిపనైనా చేసినట్టు!

రాత్రివరకూ నిరంజనరావు ఆవిధంగా కొంచెం తృప్తిగానే ఉన్నాడు. పగటిపూట రోడ్డు

రద్దీ అతనికి బాగా అలవాటయిపోయింది. ఆ రద్దీలో అతని పక్కగది దగ్గుని అంతగా గమనించలేదు. రాత్రి మాత్రం ఆ దగ్గు వినగానే కొయ్యబారిపోయేడు. ఆ దగ్గుమనిషి తన అకౌంట్స్ పరీక్షని భక్షించేస్తాడేమో నని అతను భయపడిపోయేడు. ఒకసారి ఆ దగ్గుని నోటీస్ చేసేక మరింక ఆ దగ్గుని నిర్లక్ష్యం చేసి చదువుయందు మనసు లగ్నం చేయలేకపోయే డతను. ఆస్పత్రిలో సీటు (బెడ్) కోసం వెయిట్ చేస్తూ తన పరీక్షలు అయే పర్యంతం ఆ దగ్గుమనిషి ఆ పక్కగదిలోనే ఉండిపోతాడేమోనని నిరంజనుడు గడగడలాడేడు. అయితే, ఆ దగ్గుమనిషికి వెంటనే ఆస్పత్రిలో సీటు దొరికితే పీడ విరగడవుతుందని అతను ఆశించేడు. కాని అవసరమైన వాళ్లకి అడగ్గానే సీటు ఇవ్వని లంచపు డాక్టర్ల మీదకాని, లంచం యిచ్చినా సీటు దొరకని పరిస్థితుల మీదకాని నిరంజనుడికి కోపం రాలేదు. "ప్రతి దగ్గు వెధవని ప్రభుత్వమే బాగుచేయాలంటే దేశం నిండా ధర్మాసుపత్రులే కట్టించాలి", అని కోపంగానూ వ్యంగ్యంగానూ, అనుకున్నాడతను. రాగా పోగా "ఈ దగ్గు వెధవకి సీటు దొరకదు కాబోలు దేవుడా! అనిపించిందతనికి. అప్పటికి రాత్రి పది గంటలయింది, రాత్రి పన్నెండయ్యేసరికల్లా "దగ్గడం ఆపుతావా, ఆపవా?" అని ఆ దగ్గుమనిషిని నిరంజనరావుకి తన్నాలనిపించింది. రాత్రి రెండుగంటలయే సరికల్లా ఆ దగ్గుమనిషిని అతనికి చంపేయాలనిపించింది. కోపం వల్ల కలిగిన "టెన్షన్"తో అతని నరాలు ఉబ్బాయి. కసరత్ చేస్తే అలిసిపోయినట్టు కోపం వల్ల కొంతసేపటికి అలసిపోయి అతను నిద్రపోయేడు.

అదృష్టవశాత్తూ ఆ మర్నాడు ఆ దగ్గుమనిషికి ఆస్పత్రిలో - చచ్చిన మంచం ఒకటి ఖాళీ అవగా - సీటు దొరికిందనీ, అతను ఆస్పత్రిలో అడ్మిట్ అయాడనీ తెలిసింది నిరంజనుడికి. ఆ సంగతి తెలియగానే, "వాడి దగ్గుకి వార్డులో మిగతా పేషెంట్సంతా చస్తారు. పోన్లే! మనం బతికేం! అనుకున్నాడు నిరంజనుడు. ఆ తరువాత అతని చదువు సాఫీగా సాగింది. పరీక్షలింక కొద్దిరోజుల్లోనే ఆరంభమౌతాయి. చదివిన సబ్జెక్టంతా అతనొకసారి "రివైజ్" చేసుకుందామనుకున్నాడు. రివైజ్ చేస్తుంటే అక్కడక్కడ కొన్ని కొన్ని ముఖ్య విషయాలు తనకి సరిగా జ్ఞాపకం లేదని అతనికి తెలిసివచ్చింది. దాన్తో అతనికి కొంచెం గాభరా వేసింది. ఆయా విషయాలు తొందరతొందరగా అతను తిరిగి చదవనారంభించేడు.

అంతలో పక్కింటి పిల్లడి ఏడుపు ప్రారంభం అయింది.

ఆ పిల్లడికి ఓ ఏడాది వయసు వుండవచ్చు. నిరంజనరావు ఆ కుర్రవాణ్ణి సరిగా చూడలేదు. దూరంనుంచి చూస్తే అతనికి ఆ పిల్లడు మరీ బల్లిలా కనిపించేడు. అంతకంటే దగ్గరగా, పరీక్షగా ఆ పిల్లవాణ్ణి చూడాలని అతనికి అనిపించలేదు. చూడ్డానికి అతనికి చాలా అసహ్యం వేసింది. అసలు ఆ పిల్లడు ఏడుపు ఆరంభించేదాకా ఆ పిల్లడు ఉన్నాడన్న సంగతే మర్చిపోయేడు నిరంజనుడు.

పిల్లడి తండ్రి ఆస్పత్రిలో అడ్మిట్ అయిన నాలుగు రోజుల వరకు ఆ పిల్లడి అలికిడే ఎక్కడా లేదు. ఆ తరువాత ఓ సాయంత్రం ఏడింటికి వీధిలోకి వెళ్లి, తొమ్మిదింటికి తన గదికి వచ్చేసరికల్లా నిరంజనుడికి ఆ పిల్లడి ఏడుపు వినిపించింది. పిల్లలు అప్పుడప్పుడు ఏడవడం సహజం కదా, కాసేపు ఏడ్చి ఊరుకుంటాడని అనుకున్నాడు నిరంజనుడు. కాని ఆ పిల్లడు ఊరుకోలేదు. ఆ రాత్రల్లా ఏడుస్తూనే ఉన్నాడు. అటువంటి పరిస్థితులలో

నిరంజనుడికి తరచు ఎంత కోపం వస్తుందో అంత కోపమూ ఆ రాత్రి అతనికి వచ్చింది. మర్నాడు ఉదయం అతనికి ఇష్టం లేని పనొకటి చేసేడతను. ఆ పిల్లడి తల్లి వరండాలో ఏదో పని చేసుకొంటుంటే, "ఆ పిల్లణ్ణి తీసుకువెళ్లి ఆస్పత్రిలో ఓసారి చూపించండి" అని ఆమెకి సలహా చెప్పేడు నిరంజనుడు. అతను తనతో మాట్లాడుతున్నాడని ఆమె అనుకున్నట్లు లేదు. అనుకున్నాక మాత్రం ఆమె ఎందుకో గాని చాలా గాభరా పడిపోయి వరండాలో కూర్చున్న మనిషి లేచి గదిలోకి వెళ్లిపోయింది. "మర్యాద తెలీని రాస్కెల్"గా ఆవిడ ప్రవర్తించడం నిరంజనుడికి చాలా కోపం కలిగించింది. కాని, "థాంక్స్ ఫర్ ఎరాటిక్ గాడ్!". ఆ పిల్లడు ఆ పగలల్లా ఎంతో చల్లగా నిద్రపోయేడు. రాత్రల్లా నిద్రలేని నిరంజనరావు కూడా పగలు కొద్దిసేపు మాత్రం చదువుకొని మిగతాసేపు హాయిగా నిద్రపోయేడు కాని, నిద్రలేచాక మాత్రం "అరే! నిద్రపోయేను అనవసరంగా!" అని కించపడ్డాడు నిరంజనుడు. రాత్రల్లా తెగ చదివేద్దాం అనే పట్టుదలతో అతను కుర్చీమీద సర్దుకుని దిట్టంగా సర్దుకునే సరికి పక్కగదిలో పిల్లాడు యధాప్రకారం ఏడవనారంభించేడు. ఆ రాత్రల్లా అలా ఏడుస్తూనే ఉన్నాడు. ఆ మర్నాడు పగలు మామూలుగా నిద్రపోయేడు. రాత్రి మాత్రం ఏడుపు మానలేదు. మరింక, ఈ రోజున పగలు పగలంతా ఏడ్చేడు. రాత్రి ఒంటిగంటన్నర వేళకి ఇంకా ఏడుస్తూనే ఉన్నాడు.

ఆ ఏడుపు చాలా ఘోరంగానూ, భయంకరంగానూ ఉంది. నిరంజనుడికి ఆ ఏడుపు వింటే జాలి కలగలేదు. తనమీద పగబట్టిన శత్రువులెవరో తనమీద ఆ పిల్లడి రూపంలో ఆ విధంగా కక్ష సాధిస్తున్నట్టుగా అతనికొక భావన కలిగింది. పట్టరాని ఆవేశంతో అతను చిందులు తొక్కనారంభించేడు. దరిద్రుల మధ్యనించి ఎంత తొందరగా పారిపోదాం అని తను ప్రయత్నిస్తు న్నాడో అంత పట్టుదలతో వాళ్లు తనని వెంటాడుతున్నట్టుగా అతను భావించుకోసాగేడు. కొండచిలువ పట్టుకి దొరికిపోయిన "క్రూరుడు, కొండవాడు" అసహాయంగా విషపు కేకలు వేసినట్టు అతనికి కేకలు వేయాలనిపించింది. దారిద్ర్యం వల్లనే తనకి కావలసిన చదువు దొరక్కుండా పోయింది. దారిద్ర్యం వల్లనే తన తల్లికి జబ్బు చేసింది. దరిద్రపు వాతావరణంలో ఉండటం వల్లనే అతనికి ఆనాడు అంటురోగం అంటుకుంది. విధిలేక ఆ వాతావరణంలో ఉండిపోవడం వల్లనే తన చదువుకి ఈవిధంగా అంతరాయం కలుగుతోంది - ఈ గదినుంచి వేరే మంచి చోటుకి వెళ్లిపోవడానికి తనెంత అసహాయుడో ఆ ఏడుపు మానడానికి ఆ పిల్లడు కూడా అంతగానూ అసహాయుడేనని అతనికి లోపల్లోపల అస్పష్టంగా తెలిసినప్పటికీ, ఆ తెలుసుకోడం అతనికి ఇష్టం లేకపోయింది. అలా తెలుసుకోడం వల్ల అతని మనసు మండింది కూడాను. నిజమే అవొచ్చు. కాని నేను పైటు చేస్తున్నాను, దెబ్బలాడుతున్నాను. వీళ్లు నన్ను దెబ్బలాడకుండా చేస్తున్నారు. నా తెలివితేటలకు అడ్డొస్తున్నారు. నన్ను దిగలాగుతున్నారు. వాళ్లంతా దరిద్రులుగా ఉండవలసినవాళ్లు. నేను అలాంటి అణాపరక గాణ్ణి కాను కాను కాను!

నిరంజనరావుకి పిచ్చిగా కేకలు వేసి, గోడల్ని గుద్దేసి, దరిద్రుల్ని చంపేసి, నానా బీభత్సం చేయాలనిపించింది. అతను ఉండి ఉండి పిడికిళ్లతో జుట్టు పీక్కొంటున్నాడు.

రాత్రి ఒంటిగంటన్నర దాటింది. కుళ్లిన నెయ్యిలాగా వీధంతా కంపు కొడుతోంది. రెండో ఆట తెలుగు సినిమా ముగిసింది కాబోలు - దూరంలో జనసమర్దం. మధ్య కారు

హారన్లు వినిపిస్తున్నాయి. సందుల్లో నలుగురు ఆడవాళ్లు సినిమాలో కథానాయకుడికి ఎక్కువ డబ్బిస్తారా లేక హాస్యగాడికి ఎక్కువ ఇస్తారా అనే ప్రశ్న గురించి వాదించుకొంటూ, యాసగా మాట్లాడుకొంటూ, నవ్వుకొంటూ వెళ్తున్నారు. వాళ్ల యాస మాటలూ, వెకిలి నవ్వులూ విని నిరంజనుడికి వాళ్లని చంపేద్దాం అనిపించింది. "దరిద్రపు ముండలు" అని వాళ్లనతను తిట్టుకున్నాడు. వాళ్లు ఆ సమయంలో అలా నవ్వుకొంటూ హాయిగా ఉండడం అతను సహించలేక పోయాడు. దరిద్రుల మధ్య తను నలిగి చావాలని "శాపం" ఎవరో తనకి శాపం పెట్టినట్టనిపించిందతనికి ఆ సమయంలో. దాన్తో అతనికి వెర్రెత్తినట్టుగా అయిపోయింది. లోకంమీద కాదు తనమీద పగపట్టి ఏడ్చే ఆ పక్కింటి పిల్లాణ్ని అతనికి పీక పిసికి చంపేద్దాం అనిపించింది.

అంతలో నిరంజనుడు నిశ్చేష్టుడై అలా ఆ గదిలో నిలబడిపోయేడు. అతని గదిలో వెలిగే (చవకరకపు) టేబిల్ లైటు వెలుగు వీధి వరండాలోకి (నిరంజనుడికి ఇష్టం లేకపోయి నప్పటికీ) కొంతగా ప్రసరిస్తోంది. ఆ వెలుగులో ఆ పక్కింటి ఆడమనిషి, మచ్చల చీర కట్టుకొని బక్క జిరాఫీలా నిల్చొంది. ఆమె భుజం మీద పిల్లడు అలిసిపోయి అలిసిపోయి అతి దీనంగా ఏడుస్తున్నాడు. మధ్య మధ్య ఎవరో గొంతుక నొక్కుతూ మళ్లీ మళ్లీ విడుస్తూ ఆ పిల్లణ్ణి యమబాధ పెడుతూన్నట్లుగా ఆ పిల్లడు ఆగి ఆగి ఆయాసపడి ఆయాసపడి అలిసిపోయి ఏడుస్తున్నాడు. "వీడు ఊపిరాడిలేసినా వీడి ఏడుపు మాత్రం మిగిలిపోతుంది కాబోలు!" అనే వింతైన ఆలోచన నిరంజనుడి మనసులో మెరిసింది. అంత వెర్రి కోపంలో ఉండగా కూడా ఆలోచన మెరియగానే అతనికి పాము కోరలా వంకర చిరునవ్వొచ్చింది. అంతలోనే అతనికి జుగుప్స కలిగింది. ఆడదాని సౌకుమార్యం మచ్చుకైనా లేని ఆ మురికి డొక్కునీ, దాన్ని అంటుకొని వేళ్లాడే అరటి తొక్కనీ చూస్తూండగా అతనికి వాంతొచ్చినట్టయింది, "కుష్టు రోగం అందంగా ఉంటే ఎంత బావుండును" అనుకున్నట్టు అతను, "ఎంత దరిద్రమైనా అంత జుగుప్సాకరంగా ఎందుకుండడం?" అనుకున్నాడు. దాన్తో అతనికి కలిగిన కోపం మరోలా మారగానే అతనికి వేడితగ్గిన ఆలోచనలు రానారంభించేయి. "ఇంక ఈ మురికి మనిషి నన్ను తనకేదో సాయం చెయ్యమంటుంది, తప్పదు!" అనిపించిందతనికి.

ఆవిడ చెప్పనే చెప్పింది కూడానూ.

పిల్లడికి చాలా ప్రమాదకరంగా ఉన్నట్టుందండీ. నాకూ కంపరం పుట్టుకొస్తున్నదండి. వీళ్ల నాన్నగారు ఆస్పత్రిలో ఉన్నారండీ! ఇప్పుడు టైమెంతయిందండీ! అర్ధరాత్రి దాటిపోయిం టుందండీ! పిల్లడి అవస్థ చూస్తుంటే నాకు పిచ్చెత్తినట్లుగా ఉంటోందండీ! నేను చచ్చిపోయినా బావుండుననిపిస్తోందండీ! పిల్లణ్ణి వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లి చూపించకపోతే ఏమవుతుందో నని భయం వేస్తోందండీ! ఊరుకాని ఊరు, వేళకాని వేళ పెనుచీకటిగా ఉందండీ. ఆకాశం ఉండి ఉండి ఉరుముతున్నట్లుగా కూడా ఉందండీ! ఎక్కడా ఓ రిక్షా కూడా గంటసేపయి ఇలా వెళ్లలేదండీ! ఆడదాన్ని, వంటరిదాన్ని. కాస్త ఓ రిక్షా పిల్చిపెట్టి ఆస్పత్రిదాకా కాస్త సాయం వస్తే మీకు పుణ్యం ఉంటుందండీ....."

అంటూ ఆవిడ, పగిలిన పిల్లిని కర్రగాలి గాలిగా పలికినట్టు అస్పష్టంగా జీరజీరగా మాట్లాడింది.

"అవునండీ - అవునండీ" అనుకున్నాడు నిరంజనుడు. వెంటనే అతని అసహ్యం అంతా కూడా తిరిగి పెనుకోపంగా మారింది. కోపావేశంతో అతను కుతకుత లాడేడు. భగభగ లాడేడు. అటూ ఇటూ కదుల్తూ తిరుగుతూ ఊగుతూ చేతులు ఊపుతూ పిడికిళ్లు బిగిస్తూ బల్ల గుద్దుతూ అతను ఉన్మాదంగా కేకలు వేసేడు.

"మూత్రోజుల క్రిందటే ఆస్పత్రికి తీసుకు వెళ్లమన్నాను, వెళ్లమన్నానా, లేదా? నా మాట రుచించింది కాదు మీకు, మీరెందుకు తీసుకు వెళ్తారూ!! నన్ను వాడిక్కడ పూర్తిగా తినేసేక కాని మీరు తీసుకు వెళ్లరు. ఏఁవిఁటీ? తీసుకు వెళ్లేరా? అక్కడ డాక్టర్లు సరిగా చూడలేదంటారా! బాగా చూసేవాడి దగ్గరికే తీసుకుపోలేకపోయారా? లేకపోతే, ఆ డాక్టరే సరిగా చూసేదాకా అక్కడే హంగర్ స్ట్రయికు చెయ్యలేకపోయారా? నో నో నో? నేను రిక్షా పిలవను, ఆస్పత్రికి రాను, సహాయం చెయ్యను. మీ కష్టాలు కూడా నేనెందుకు పడాలి? మీ బురద కూడా నేనెందుకు పూసుకోవాలి? మీ కోసం నా రక్తం నే నెందుకు ధారపొయ్యాలి? ఆస్పత్రిలో న యం కాకపోతే దార్లోనే ఆ పిల్లడు తారుమంటే నేనేం చెయ్యాలి?? కాట్లో ఆ బరువు కూడా నేనే దించాలి. దించమంటారు మీరు. మీ దగ్గర డబ్బుండదు. మీ కోసం నేను ముప్పైత్తాలి. మీకోసం అప్పు చెయ్యాలి. మీకోసం బాధలు పడాలి. దార్లో తారుమనకుండా ఆస్పత్రికే వెళితే అక్కడి డాక్టర్ని బతిమాలుకోవాలి. లేకపోతే వాడితో దెబ్బలాడాలి. మీ ఆయనకి కబురు చెప్పాలి. ఆయన ఏడుపు కూడా వినాలి. మీకోసం నేను మహాత్మా గాంధీలా మొహం పెట్టాలి. త్యాగం త్యాగం వల్లకాటి త్యాగాలు చెయ్యాలి. మీ బరువులు నే నెత్తుకోవాలి. మీ బాధలు నేను సహించాలి; అంతేనా! అవును కాని, నేను చెయ్యను. నేనా పన్లు చెయ్యను. మీ బరువులు మీరే ఎత్తుకోండి. మీ బాధలు మీరే సహించండి. లేకపోతే సహించుకోకుండా పొండి? మీతో నాకు సంబంధం లేదు. మీతో నేను సంబంధం పెట్టుకోను. మీలోంచి నేను బైటికి పోతాను. పోయి తీరుతాను. నన్ను దిగలాగేవార్ని చంపేస్తాను. నాశనం చేస్తాను. పిలవను, రిక్షా పిలవను; రాను, ఆస్పత్రికి రాను. చెయ్యను, సహాయం చెయ్యను. మీకోసం నేను పూచికపుల్ల మొయ్యను. నా చూపుడు వేలు చూపిస్తే చాలు మీరంతా బాధల బురదల్లోంచి బైటపడి బంగారు లోకాల్లో విహరిస్తారంటే నేను చూపుడు వేలు చూపించను. ఎందుకు చూపించాలి? వెళ్లండి. మీ ఇష్టం వచ్చిన చోటికి ఎలా వెళ్తారో వెళ్లండి. వెళ్లలేకపోతే మునిసిపాలిటీ కాలవల్లో మురగండి! గంగలోకి ఉరకండి! బంగాళాఖాతంలోకి బండరాయి మెడక్కట్టుకొని దూకండి! మీతో నాకు సంబంధం లేదు లేదు! పొండి! పొండి! -

అని నిరంజనుడు గావుకేకలు వేసి తన గది తలుపులు ఫెడేల్మని మూసేసుకున్నాడు.

ఆ తరువాత?

ఆ తరువాత నిరంజనుడికి తెల్లవారింది. తెల్లవారేక అతను పక్కగది వైపు చూసేడు. ఆ గదికి తాళం వేసేసి ఉంది. ఆ రోజల్లా ఆ పక్కింటి ఆవిడ నిరంజనుడికి కనిపించలేదు. ఆ రాత్రి భోజనానికి హోటల్‌కి వెళ్లివచ్చేక భోగట్టా చెయ్యకుండానే నిరంజనుడికి తెలిసింది. ఆవిడ గది ఖాళీచేసి వెళ్లిపోయిందని.

పిల్లవాడు ఏమయేడు?

నిరంజనుడు ఆ విషయం గురించి కూడా భోగట్టా చెయ్యలేదు. ఆ విషయం మరోలా అయినా తెలుసుకోలేదు. అతనికి ఒక్కటే భయం - తన పరీక్షలు అయేలోపున ఆ పక్కగదిలో మరెవరైనా దిగుతారేమోనని? కాని, లక్కీగా అందులో ఎవరూ దిగలేదు.. ఇంటివాళ్లు ఆ దగ్గర్లో లేకపోవడం వీలు చూసుకొని, ఆ గది ఖాళీగా లేదని నిరంజనుడు చాలామందికి చెప్పేడు.

★ ★ ★

"ఇదంతా జరిగి ఎన్నాళ్లయిందండీ?"

"పదిహేనేళ్లయింది సార్!"

"మరైతే - రంజనుడో నిరంజనుడో - అతనేం చేస్తున్నాడండీ ఇప్పుడు?"

వాడిప్పుడు ప్రజలపై పన్నులు విధించే ప్రభుత్వ ప్రత్యేక శాఖలో ప్రధానోద్యోగిగా ఉంటున్నాడు సార్!"

***ఆంధ్రజ్యోతి వారపత్రిక, 14-7-1967***